మునగ సాగు.. ఆదాయం బాగు

- సుందరగిరిలో సాగు చేస్తున్న 30 మంది రైతులు


సుందరగిరిలో ఏపుగా పెరిగిన మునగ చెట్లు

చిగురుమామిడి: సుందరగిరి గ్రామంలో నాబార్డు సహకారంతో రైతులు మునగ సాగు చేస్తున్నారు. వీరికి నాబార్డు సంస్థ పూర్తిస్థాయిలో సబ్సిడీ అందిస్తున్నారు. గ్రామంలో 30 మంది రైతులు మునగ పంటను సాగు చేస్తున్నారు. ఈ పంట నూటికి నూరు శాతం సబ్సిడీపై రైతులకు నాబార్డు సంస్థ అందించింది. 10 గుంటల నుంచి 20 గుంటల వరకు రైతులు సాగు చేస్తున్నారు. ఈ పంట ద్వారా రైతులు రూ.30వేల నుంచి రూ.50వేల వరకు ఆదాయం పొందుతున్నారు. ఎప్పుడూ ఒకేరకమైన పంటను సాగు చేస్తే భూమిలో ఉన్న సారం దెబ్బతినే ప్రమాదమున్నందున.. రైతులు పంట మార్పిడి విధానంపై ప్రత్యేక దృష్టి సారించారు. సబ్సిడీపై అందించిన మునగ మొక్కలను నాటి సాగు యాజమాన్య పద్ధతులు చేపట్టారు.

112 మొక్కలు..

10 గుంటలు సాగు చేసిన రైతుకు నాబార్డు సంస్థ నుంచి 112 మొక్కలను ఉచితంగా సబ్సిడీపై అందించారు. గుంతలు తీసి నాటిన రైతులు.. వర్మికంపోస్టు, వేప పిండి, మల్చింగ్ కవర్లు, వేపనూనె, వేస్ట్ డికంపోజర్లను ఉపయోగించారు. అతి తక్కువ స్థలంలో రూ.వేల ఆదాయాన్ని పొందుతున్నారు. ఒకవైపు పంట మార్పిడి పద్ధతులను అవలంబిస్తూ.. మరోవైపు ఎలాంటి రసాయన ఎరువులు వాడకుండా యాజమాన్య పద్ధతులు అవలంబిస్తున్నారు.

కాలపరిమితి ఆరు నెలలు

అనతి కాలంలోనే ఆదాయం పొందే అవకాశముంది. నాటిన ఆరు నెలల కాలంలో పంట చేతికొస్తుంది. మరో ఆరు నెలల పాటు ఆదాయం వస్తుంది. సేంద్రియ పద్ధతిలో మునగ సాగు ద్వారా రైతులను ప్రోత్సహిస్తున్నారు. మునగ సాగు ద్వారా రెండు రకాల ఆదాయం పొందే అవకాశముంది. కాయలు మార్కెట్‌కు తరలించి అమ్ముకోవచ్చు. కాయలు లేని సమయంలో ఆకును పొడర్‌గా చేసి మార్కెట్ చేసి ఎఫ్‌పీవో పేరుపై విక్రయించే అవకాశముంది. మేడికొండ న్యూట్రియన్స్ హైదరాబాద్ సంస్థతో టైయప్ అయ్యారు. వీరి ద్వారా ఈ పొడర్‌ను మార్కెట్‌కు తరలించి ఆదాయం పొందే అవకాశముంది. కాగా సుందరగిరి రైతులు సాగు చేసిన మునగ ఆకును తెంపి గన్నేరువరం మండల కేంద్రానికి తరలించాల్సి ఉంది. అక్కడ ఆకును పొడర్‌గా మార్చే యంత్రాన్ని నాబార్డు సంస్థ అందించింది.

రూ.లక్ష వరకు ఆదాయం

మునగ సాగు చేసిన రైతులకు ఒక మొక్క నుంచి సంవత్సరంలో 250 కాయల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో మునగ కాయల ఖరీదు వంద రూపాయల వరకు ఉందని రైతులు తెలిపారు. 20 గుంటలు సాగు చేయగా.. 112 మొక్కలు నాటారు. సంవత్సరానికి రూ.50వేల నుంచి లక్ష వరకు ఆదాయం పొందే అవకాశముంది. మితగా పంటలు 20 గుంటల్లో సాగు చేస్తే సంవత్సరానికి రూ.30వేల ఆదాయం సమకూరుతుంది. ఇందులో రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు, కల్టివేషన్ ఖర్చులు పోను రైతులకు జీరో ఆదాయం వస్తుంది. కాని మునగ సాగు చేసిన రైతులకు ఒకసారి నాటితే సంవత్సర కాలంలో ఎలాంటి కల్టివేషన్ లేదు. మొక్కకు మొక్కకు మధ్య దూరం మూడు మీటర్లు ఉంటుంది. ఈ మూడు మీటర్లలో అంతర పంటలు సాగు చేసుకునే అవకాశముంది. అంతర పంటగా బంతి, వేరుశనగ, పెసర, ఇతర ఆకుకూరలు, కూరగాయలను సాగు చేస్తున్నారు.

రూ.50వేల ఆదాయం వచ్చింది



25 గుంటల వరకు మునగ సాగు చేస్తున్న. ఇప్పటికే దాదాపు రూ.50వేల వరకు ఆదాయం పొందిన. ఆకుకూరలు, పందిరి కూరగాయలు కలిపి మరో రూ.50వేల ఆదాయం వచ్చే అవకాశముంది. మునగ సాగుతో ఎలాంటి ఇబ్బందుల్లేవు.

\- శ్రీమూర్తి శ్రీనివాస్, సుందరగిరి

ఆదాయం రెట్టింపు చేయడమే నాబార్డు ఉద్దేశం



మునగ సాగు ద్వారా అధిక ఆదాయం పొందేందుకు గాను జిల్లాలోని చిగురుమామిడి, గన్నేరువరం మండలాలను ఎంపిక చేసుకున్నాం. చిగురుమామిడి మండలంలో 30 మంది రైతులు మునగ సాగును చేపట్టగా.. గన్నేరువరంలో 20 మంది రైతులు సాగు చేస్తున్నారు. మొత్తం 25 ఎకరాల్లో సాగవుతోంది. పంటమార్పిడి విధానంతో భూసారాన్ని పెంపొందించి వారి ఆదాయాన్ని రెట్టింపు చేయడమే ప్రధాన ఉద్దేశం. మునగ సాగుతో రైతులకు అధిక ఆదాయం వస్తుంది. దీని పొడర్, కాయల ద్వారా ఆదాయం వస్తుంది.

\- ఎస్.జయప్రకాశ్, నాబార్డు ఏజీఎం, కరీంనగర్ జిల్లా

పదవీకాలం పెంచాలి


వినతి పత్రం అందిస్తున్న సర్పంచులు

శంకరపట్నం: రెండేళ్ల పదవీకాలం పెంచాలని ఎంపీడీవో శ్రీవాణికి శనివారం సర్పంచులు వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం ఫిబ్రవరి 1 నుంచి సర్పంచుల పదవీకాలం ముగుస్తుందని, గతంలో సర్పంచుల పదవీకాలం పొడిగిస్తూ రెండేళ్ల పాటు అవకాశం ఇచ్చిందని పేర్కొన్నారు. తమ పదవీకాలంలో కరోనాతో ఇబ్బందులు పడ్డామని, చేసిన పనుల బిల్లులు రావాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సంజీవరెడ్డి, రాజయ్య, భద్రయ్య, సంపత్, అనిత, మానస, రజిత, కిషన్‌రావు, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వినతి

రామడుగు: సర్పంచుల పదవీకాలం పెంచాలని మండల సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీవో భాస్కర్‌రావుకి వినతి పత్రం అందజేశారు. పదవీకాలం జనవరి 31తో ముగియనుందని, తాము చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో నానా ఇబ్బంది పడుతున్నామని, పెండింగ్ నిధులు విడుదల చేయాలని కోరారు. అధ్యక్షుడు బండ అజయ్‌రెడ్డి, సర్పంచులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో..

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీడీవో జయశ్రీకి ఆయా గ్రామాల సర్పంచులు వినతి పత్రం సమర్పించారు. అనంతరం సర్పంచులు మాట్లాడుతూ.. నిధులు రాక అప్పులపాలయ్యామని, పెండింగ్ నిధులు వచ్చేవరకు పదవీకాలాన్ని పెంచాలని కోరారు.

నేదునూర్ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం


పాల్గొన్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

తిమ్మాపూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మూడో శనివారం సందర్భంగా తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. నేదునూర్ జిల్లాపరిషత్ పాఠశాలలో హెచ్‌ఎం సీహెచ్ లక్ష్మణ్‌రావు, ఎస్‌ఎంసీ చైర్మన్ మల్లయ్య ఆధ్వర్యంలో పేరెంట్-టీచర్ మీటింగ్ నిర్వహించారు. 37 మందికి గానూ 25 మంది విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. లక్ష్మణరావు మాట్లాడుతూ.. కొంతమంది బేసిక్స్ కూడా రాని విద్యార్థులను గుర్తించామని, వీరిని ఉపాధ్యాయులు దత్తత తీసుకుంటారని తెలిపారు. పాఠశాల ముగిసిన తర్వాత వీరికి ప్రత్యేక తరగతులు నిర్వహించి బేసిక్స్ నేర్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జనవరి 29న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. ఈ మేరకు ఓటరు జాబితాను విడుదల చేశారు. 100 శాతం తల్లిదండ్రులు ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. తిరుపతిరెడ్డి, జారాక్ హుస్సేన్, గని, పద్మ, అనిస్, ఫాతిమ, అమల, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు

జమ్మికుంట: ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. విలాసాగర్ గ్రామానికి చెందిన దుగ్యాల శ్రీకాంత్‌తో అదే గ్రామానికి చెందిన రాచపల్లి ప్రశాంత్, రాచపల్లి సంపత్ డబ్బుల విషయంలో గొడవ పడ్డారు. ఆవేశంలో బండరాయితో దాడి చేయగా.. తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

అంబేడ్కర్ భవనం నిర్మించాలి

శంకరపట్నం: మండల కేంద్రంలో అంబేడ్కర్ భవనాన్ని నిర్మించాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో సంఘ సభ్యులతో సమావేశమై విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి అంబేడ్కర్ భవనాన్ని మంజూరు చేయాలని ఎమ్మెల్యే సత్యనారాయణకు వినతి పత్రం సమర్పిస్తామన్నారు. కల్వల రాంచంద్రం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

రామడుగు: గోపాల్‌రావుపేట జిల్లాపరిషత్ పాఠశాలను శనివారం గ్రామ సర్పంచ్ కర్ర సత్యప్రసన్న తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారు తీరు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. పూర్తిస్థాయిలో విద్యార్థుల హాజరు శాతం ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఎంఈవో వేణుకుమార్, విద్యాకమిటీ చైర్మన్ సాయిలు పాల్గొన్నారు.

29న ఎస్‌ఎంసీ ఎన్నికలు

మానకొండూర్: ఈనెల 29న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు జరగనున్నట్లు మండల విద్యాధికారి మధుసుదనాచారి తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, గురుకుల, మోడల్ స్కూల్, కస్తూర్బా అన్ని స్కూళ్లలో స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించిందన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం


లైట్లు ప్రారంభిస్తున్న సర్పంచ్

రామడుగు: వెలిచాల గ్రామ స్వామి వివేకానంద విగ్రహ చౌరస్తా, శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం, పెద్దమ్మతల్లి, సమ్మక్క సారలమ్మ దేవాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను సర్పంచ్ వీర్ల సరోజన ప్రభాకర్‌రావు ప్రారంభించారు. జిల్లా రైతుబంధు కమిటీ సభ్యుడు వీర్ల సంజీవరావు, మాజీ సర్పంచ్ రవీందర్‌రావు, గ్రామ యువకులు, పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే లెదర్ పార్కు సాధ్యం

చొప్పదండి: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే లెదర్ పార్కుకు సంబంధించిన పనులు జరుగుతున్నాయని కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్ అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్లుగా లెదర్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ మూలకు పడిందన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు లెదర్ పార్కు, ఇండస్ట్రీస్‌కు భూముల కేటాయింపు జరిగిందన్నారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం విక్రమార్క కేంద్రం దృష్టికి లెదర్ ఇండస్ట్రీ అభివృద్ధి చేయాలని సూచించారని తెలిపారు. సమావేశంలో గుర్రం రమేశ్‌గౌడ్, సంబోజి సునీల్, మావురం రాములు, నిజానపురం చందు, గోస్కుల కొమురయ్య, బొడిగె తిరుపతి, నూనె చందు, గుంటి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

సైదాపూర్: వెన్కెపల్లి, ఆకునూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ద్వారా సరఫరా అయ్యే ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల పనులు నిర్వహిస్తున్నందున ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 వరకు అంతరాయం ఉంటుందని ఏఈ ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తిమ్మాపూర్ మండలంలో..

తిమ్మాపూర్: నల్లగొండ, నుస్తులాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అరవిందరెడ్డి తెలిపారు. లైన్స్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. నల్లగొండ సబ్ స్టేషన్ పరిధిలోని నల్లగొండ, మొగిలిపాలెం, పర్లపల్లి, పోలంపల్లి, బాలయ్యపల్లి, మక్తపల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో, నుస్తులాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని నుస్తులాపూర్, రామకృష్ణకాలనీ, కొత్తపల్లి, ఇందిరానగర్ గ్రామాల్లో నిలిపివేస్తామని వివరించారు.

అధికారులకు స్వాగతం

రామడుగు: స్టడీ టూర్‌లో భాగంగా ఐదుగురు ట్రైనీ ఐఈఎస్(ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్) అధికారులు శనివారం సాయంత్రం వెలిచాల గ్రామానికి చేరుకున్నారు. వెలిచాల సర్పంచ్ వీర్ల సరోజనప్రభాకర్‌రావు, ఎంపీడీవో భాస్కర్‌రావు, పలు శాఖల సిబ్బంది స్వాగతం పలికారు.

ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రం తనిఖీ


ఓటరు నమోదు ప్రక్రియను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్

రామడుగు: దేశరాజ్‌పల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటరు నమోదు ప్రక్రియ తీరును బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా నమోదు చేసుకునేవారి పూర్తి వివరాలతో దరఖాస్తులను తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. తహసీల్దార్ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు. పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనంతో పాటు విద్యాబోధన తీరును ఉపాధ్యాయులనడిగి తెలుసుకున్నారు.

గాలన్న మృతి.. పలువురి సంతాపం


నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యం

సైదాపూర్/గంగాధర: చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ భర్త తెలంగాణ ఉద్యమకారుడు బొడిగె గాలన్న మృతిచెందగా.. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ మంత్రి ఈటల రాజేందర్ శనివారం మృతదేహం వద్ద నివాళి అర్పించారు. గాలన్న కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. గాలన్న స్వగ్రామం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వెంకటేశ్వర్లపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. తెలంగాణ ఉద్యమంలో గాలన్న కృషిని ఈటల గుర్తు చేశారు.

వరిపొలాల పరిశీలన


కొత్తగట్టులో వరి పరిశీలిస్తున్న అధికారి

శంకరపట్నం: కొత్తగట్టు గ్రామంలో రైతుల వరి పొలాలను మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. పంటపొలాలు పిలకలు వేసే దశలో ఉన్నాయని, మొగి పురుగు ఆశించకుండా లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. జింక్ లోపమున్న పంటల రైతులు జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేయాలని సూచించారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

చిగురుమామిడి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, దాని నివారణకు తగిన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి రంజిత్‌కుమార్ రైతులకు సూచించారు. కొండాపూర్ గ్రామంలో వాతావరణ పరిస్థితుల వల్ల దెబ్బతిన్న వరి పంటలను శనివారం పరిశీలించారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి పది కిలోలు చల్లుకోవాలని, అవి అందుబాటులో లేకుంటే కార్టాప్ హైడ్రోక్లోరైడ్ గుళికలు ఎకరానికి 8 కిలోలు చల్లుకోవాలని తెలిపారు. గుళికలు చల్లే సమయంలో మడుల్లో నీరు రెండు ఇంచుల వరకు నిల్వ ఉంచాలన్నారు. చాలా గ్రామాల్లో వరి వేర్లు కుళ్లిపోయి నల్లగా మారి కుళ్లిన కోడిగుడ్డు వాసన వస్తుందని, మొక్కలు ఎండిపోయి దిగుబడి తగ్గే ప్రమాదముందని అన్నారు. దీని నివారణకు ల్యాబ్ జింకును రెండు మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే అరికట్టొచ్చన్నారు.

సంక్షిప్త వార్తలు

పాలకవర్గం సహకారంతో గ్రామాభివృద్ధి

జమ్మికుంట: గ్రామాల పునర్విభజన సందర్భంగా నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటైన పాపయ్యపల్లి అభివృద్ధి పాలకవర్గం సహకాంతోనే జరిగిందని సర్పంచ్ వజ్జపల్లి ఆగయ్య అన్నారు. శనివారం పాపయ్యపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం చివరి సమావేశం నిర్వహించారు. 2018లో నూతన గ్రామ పంచాయతీ బిజిగిరిషరీఫ్ నుంచి నూతనంగా పాపయ్యపల్లి ఏర్పాటు జరిగిన తర్వాత ఎన్నికల్లో మొట్టమొదటిగా సర్పంచ్‌గా ప్రజలు అవకాశమిచ్చి ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్ రాము, గుండెకారి సరోజన, మీసాల శంకర్, అరెపల్లి స్వరూప తదితరులు పాల్గొన్నారు.

విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

హుజూరాబాద్: అధికారులు విధులను సమర్థవంతంగా నిర్వహించి అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో రివ్యూ మీటింగ్ జరిగింది. ఆర్డీవో రాజు, తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తిమ్మాపూర్: నల్లగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద పురగిరి క్షత్రియ పెరిక సంఘం జిల్లా శాఖ రూపొందించిన 2024 క్యాలెండర్‌ను శనివారం జిల్లా అధ్యక్షుడు గాండ్ల చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ప్రధాన కార్యదర్శి బస్వ వెంకన్న, జిల్లా కార్యదర్శి గోళ్ల బానేష్, మార్త వేణుగోపాల్, మండల అధ్యక్షుడు పాలేటి కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి మీసరాజు, సభ్యులు గాండ్ల శ్రీనివాస్, చింతం శ్రీనివాస్, దాసరి రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నవోదయ అర్హత పరీక్ష

హుజూరాబాద్: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరోతరగతి ప్రవేశాల కోసం శనివారం పట్టణంలో నిర్వహించిన నవోదయ అర్హత పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈవో కేతిరి వెంకట నరసింహారెడ్డి తెలిపారు. రెండు కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 375కి గాను 262 మంది హాజరయ్యారన్నారు.

పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలి


వివరాలడిగి తెలుసుకుంటున్న లక్ష్మీకిరణ్

మానకొండూర్: ఓటరు జాబితాలో తప్పుల్లేకుండా చూసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ అధికారులకు సూచించారు. ముంజంపల్లి గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని శనివారం సందర్శించి పరిశీలించారు. గ్రామంలో ఎంతమంది ఓటర్లున్నారని తెలుసుకున్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఫాం 6, 7, 8కు ఎన్ని దరఖాస్తులు చేసుకున్నారని అడిగారు. ఓటరు లిస్టులో పేర్లు తప్పుగా ఉన్నా సరి చేయాలని, చనిపోయినవారి పేర్లుంటే తొలగించాలన్నారు. అన్ని వివరాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



గంగాధర: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పుల్ల అభిలాష్ తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా రాత్రి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఇస్లాంపూర్ గ్రామ సమీపంలో పట్టుకున్నట్లు చెప్పారు. అనుమతులు లేకుండా మండలంలో ఇసుక తరలిస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటు డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామన్నారు.

పరామర్శ


చీమలకుంటపల్లెలో పరామర్శిస్తున్న కవ్వంపల్లి

గన్నేరువరం: గన్నేరువరంకు చెందిన పండుగ మధురమ్మ, మునిగంటి లింగయ్య, గోపాల్‌పూర్‌లో ర్యాకం లక్ష్మణ్, చీమలకుంటపల్లెలో కుసుంభ మోతయ్య ఇటీవల మృతిచెందగా.. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సత్యనారాయణ శనివారం పరామర్శించారు. ముస్కు ఉపేందర్‌రెడ్డి, అనంతరెడ్డి, బొడ్డు సునిల్, మాతంగి అనిల్, చింతల శ్రీధర్‌రెడ్డి, రాజేందర్, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

నివాళి..

జమ్మికుంట: పట్టణంలోని బీజేపీ నేత, మాజీ ఉప సర్పంచ్ పొనగంటి శంకరయ్య ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా.. మృతుడి కుటుంబాన్ని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి శనివారం పరామర్శించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి సంతాపం తెలిపారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అడ్డుకోవడం సరికాదు

హుజూరాబాద్: గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం సరికాదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొలిపాక సమ్మయ్య అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కమలాపూర్ మండలం కన్నూర్‌లో గ్రామ పంచాయతీ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే వస్తే.. కాంగ్రెస్ నాయకులు సాకులు చూపి అడ్డుకోవడం సరికాదన్నారు. నాయకులు ఎండీ ఇసాక్, ప్రతాప శ్రీనివాస్, పైడాకుల మొండన్న, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థికి ఆర్థిక సాయం

చిగురుమామిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న దూల వైష్ణవి తండ్రి కొంరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కళాశాల అధ్యాపకులు, తోటి విద్యార్థులు వైష్ణవికి ఆర్థిక సాయం అందించారు. అధ్యాపకులు రూ.7వేలు, తోటి విద్యార్థులు రూ.2వేలు అందజేశారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇల్లందుల సంపత్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నియమాలు తప్పనిసరిగా పాటించాలి

హుజూరాబాద్: ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని హుజూరాబాద్ ఎంవీఐ ఠాకూర్ ఈశ్వర్‌సింగ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాన్ని పురస్కరించుకొని రవాణా శాఖ కార్యాలయానికి వచ్చిన దరఖాస్తుదారులతో రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై ప్రతిజ్ఞ చేయించారు.

ఆధ్యాత్మికం

దేవాలయాల్లో 'స్వచ్ఛ తీర్థ్'


రామాలయం శుభ్రం చేస్తున్న నాయకులు

హుజూరాబాద్: ఈనెల 22న అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరగనున్న నేపథ్యంలో ప్రధాని పిలుపు మేరకు శనివారం స్వచ్ఛ తీర్థ్ కార్యక్రమంలో భాగంగా ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తూర్పాటి రాజు ఆధ్వర్యంలో 23వ వార్డులోని హనుమాన్, రామాలయాలను బీజేపీ శ్రేణులు శుభ్రం చేశాయి. నాయకులు మాడ సందీప్, గుండేటి భార్గవ్, తూర్పాటి రాజ్‌కుమార్, తుర్పాటి రాజశేఖర్, పర్థం అనిల్, సాగర్, రాజు, భూతం సాయిరాం, తూర్పాటి సునీల్, అరవింద్, అంకటి వాసు, కొలిపాక శ్రీనివాస్, రాంప్రసాద్, పిట్ట నరసింహులు, కోటేశ్వర్ పాల్గొన్నారు.

జమ్మికుంటలో..

జమ్మికుంట: పట్టణంలోని సంజీవని ఆంజనేయస్వామి ఆలయంలో బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి రాజేశ్ ఠాగూర్ ఆధ్వర్యంలో శుభ్రం చేశారు. వార్డు అధ్యక్షుడు నాగపూరి విజయ్‌గౌడ్, రాకేశ్ ఠాగూర్, రవి, సుశాంత్, రమేశ్, అకాష్, అజయ్, సచిన్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సీతారామస్వామి కల్యాణ మహోత్సవం

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ సమీపంలో సోమవారం అయోధ్యలో రాముడి కుంబాభిషేకం ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని సీతారామస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విష్ణువర్ధన్‌ను సన్మానించిన ఎమ్మెల్యే


సన్మానిస్తున్న కవ్వంపల్లి

గన్నేరువరం: జాతీయస్థాయి కబడ్డీ ఎస్‌జీఎఫ్ అండర్ 14 విభాగంలో గన్నేరువరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున్న విద్యార్థి, క్రీడాకారుడు బుర్ర విష్ణువర్ధన్ ఇటీవల ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా అతన్ని గన్నేరువరంలో శనివారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శాలువాతో సన్మానంచారు. వ్యాయామ ఉపాధ్యాయుడు రాజబాబును అభినందించారు. విద్యాకమిటీ చైర్మన్ బుర్ర మల్లేశం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మాతంగి అనిల్, గ్రామ శాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, నాయకులు నల్ల చంద్రారెడ్డి, బుర్ర తిరుపతిగౌడ్, సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత

గన్నేరువరం: బాలల పరిరక్షణ అందరి బాధ్యతగా గుర్తించి అధికారులు, కమిటీ సభ్యులు తగిన ప్రాధాన్యమివ్వాలని ఎంపీపీ మల్లారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బాల పరిరక్షణ కమిటీ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు, డ్రాపవుట్, దత్తత, భిక్షాటన, బాల కార్మికులు, అనాథ పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులపై సమావేశంలో చర్చించారు. సీడీపీవో సబిత, తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో స్వాతి, ఎస్సై చందా నరసింహారావు, వైద్యాధికారుడు ఉపేందర్, అధికారులు పాల్గొన్నారు.